కలికిరి మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల



కంచికి చేరిన కంచె కథ

- ప్రహరీ లేకపోవడంతోనే ఆక్రమణలకు అవకాశం
- కంచె వేయిస్తానన్న కలెక్టరు హామీ హామీగానే మిగిలింది..
- ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలని సీపీఐ డిమాండు

కలికిరి, మార్చి 5: జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించిన కలికిరి మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల భూమి ఆక్రమణకు జరిగిన ప్రయత్నాలకు అధికారుల వైఫల్యాలే ప్రధాన కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాల తరగతి గదులు, వసతి గృహాలకు పోనూ మిగిలిన 7 ఎకరాల భూమికి కనీసం కంచె కూడా వేయకుండా గాలికి వదిలేయడం వల్లే వివాదానికి దారి తీసిందని అంటున్నారు. ఈ భూమిలో సంవత్సర కాలంగా తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికార పార్టీ ముఖ్య నేతలను పొరుగునే ఉన్న నగ్రావాండ్లపల్లె గ్రామస్తులు ఒత్తిడి చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. దీనిని పరిష్కరించడానికి గత ఏడాది జూలై 22న అప్పటి జిల్లా కలెక్టరు గిరీషా కళాశాలను సందర్శించారు. విద్యార్థినుల ఆట స్థలం, ఆడిటోరియం, మినీ స్టేడియంల నిర్మాణం కోసం 7 ఎకరాలను కేటాయించినట్లు కలెక్టరు గుర్తించారు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన కలెక్టరు కళాశాలలోనే అధికారులతో సమీక్ష నిర్వహించారు. కట్టడాల పని తరువాత చూడొచ్చని ముందు మొత్తం ఏడు ఎకరాల భూమికి వెంటనే హద్దులు గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా హద్దుల చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేయడానికి అంచనాలు అందజేస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తానని కలెక్టరు హామీ ఇచ్చారు. దాదాపు ఏడు నెలలు గడిచినా రెవెన్యూ అధికారులు ఇప్పటికీ సరిహద్దులు గుర్తించకుండా తాత్సారం చేశారు. కలెక్టరు హామీ మేరకు కంచె ఏర్పాటుకు నిధులు కూడా విడుదల కాలేదు. దీంతో కంచె కథ నేరుగా కంచికే చేరినట్లయింది. ఆ తరువాత నగ్రావాండ్లపల్లె గ్రామస్తులు ఇళ్ల స్థలాల కోసం భూమి చదును చేయడానికి సోమవారం ప్రయత్నించారు. అభ్యంతరం చెప్పడానికి వెళ్లిన కళాశాల సిబ్బందిపై కొంతమంది గ్రామస్తులు ఘర్షణకు దిగడంతో వారు వెనుదిరిగారు. విషయం తెలిసిన విద్యార్థినులు మూకుమ్మడిగా నడుం బిగించి భూమి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకోవడంతో వివాదానికి తాత్కాలికంగా తెరపడిన విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారుల నుంచి వచ్చిన తాజా ఆదేశాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగినా ఆమె చెప్పడానికి నిరాకరించారు.

గ్రామస్థులకు కాలనీ స్థలాలు మంజూరు

కాగా ఇదే గ్రామస్థులకు కొత్తపల్లె వద్ద ఏర్పాటైన కాలనీలో పట్టాలు మంజూరు చేసినట్లు వెల్లడైంది. ఈ కాలనీ గ్రామానికి దూరంగా ఉండటంతో అక్కడ ఇళ్ల నిర్మాణానికి సంకోచించారు. ఈలోగా కళాశాల భూమి పక్కనే నాలుగు లేన్ల రహదారి పనులు ప్రారంభం కావడంతో గ్రామస్థులు దీనికోసం పట్టుబట్టడం ప్రారంభించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశల ఎదురుగానే జాతీయ రహదారికి అటువైపు మహిళా డిగ్రీ కళాశాల ఉంది. ఈ రెండింటి మధ్య నాలుగు లేన్ల రహదారి ఏర్పాటవడంతో ఈ భూముల విలువ రూ.కోట్లలోకి చేరింది. మరోవైపు ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామస్థులు నాయకులపై ఒత్తిడి పెంచారు. దీని కారణంగానే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి

మహిళా కళాశాలకు చెందిన భూమి కోసం దురాక్రమణకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథనాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండు చేశారు. మంగళవారం వారు ఆక్రమణకు ప్రయత్నించిన భూమిని పరిశీలించిన అనంతరం ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్లు మీడియాకు చెప్పారు. కంచెను ఏర్పాటు చేయకున్నా లేదా తిరిగి ఆక్రమణలకు పాల్పడినా జిల్లాలోని విద్యార్థులతో కలిసి కలెక్టరు కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. భావితరాలకు ఉపయోగపడే భూమిని కాజేయాలనుకోవడం దుర్మార్గమని ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే గానీ ఇలాంటి వాటికి అడ్డుకట్టపడదని చెప్పారు. ఈ భూమిని రక్షించుకోవడానికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఎలాంటి పోరాటాలు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, ప్రశాంత్‌పాల్గొన్నారు.



కళాశాల సిబ్బంది, విద్యార్థులతో అప్పటి కలెక్టర్ గిరీషా (ఫైల్)

బరితెగింపు.. బలయ్యేది ఎవరో..?

- యథేచ్ఛగా అధికార పార్టీ నేతల చీరలు, కానుకల పంపిణీ
- భయం లేకుండా.. ఓటర్లకు ప్రలోభయత్నం
- ఎన్నికల సంఘం ఏ చర్యలు తీసుకుంటుందోనన్న భయాందోళనలో అధికారులు

అధికార పార్టీ నాయకులు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు జగనన్నకు ఓటేద్దాం.. పేరుతో చీర ఉన్న బ్యాగును పంపిణీ చేస్తున్నారు. ఆ బ్యాగు ఇస్తూ గ్రూపు ఫొటో తీసుకున్నట్లు ఫోజులు ఇస్తున్నారు. ఈ పంపిణీ వ్యవహారం పత్రికల్లో వస్తున్నా అధికారులు అడ్డుకోలేకున్నారు. ఒకటి రెండుచోట్ల అడ్డుకోవడానికి జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నా అధికార పార్టీ నాయకులు లెక్కచేయడం లేదని తెలుస్తోంది. వైసీపీ నాయకులు బరితెగించి మరీ పబ్లిక్‌గా పంపిణీ చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల బరితెగింపు ఈసారి ఎవరిని బలి తీసుకుంటుందోనని అధికారులు లోలోపల హడలిపోతున్నారు.



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నికల్లో అక్రమాలు అంటే పోలింగ్ బూత్‌లు ఆక్రమించి రిగ్గింగ్ చేయడం, సైక్లింగ్ చేయడం, ఒకరి ఓటును మరొకరు వేసేయడం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం, ఇతర కానుకల పంపిణీ వంటివి ఉండేవి. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్‌రావు మృతితో 2021 సంవత్సరంలో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక దేశ ఎన్నికల చరిత్రలో పది కాలాల పాటు నిలిచిపోయే ఎన్నిక. అధికార పార్టీ అధికార దాహంతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోకి అక్రమంగా ప్రవేశించి సుమారు 35 వేల మంది ఓటర్ల సమాచారాన్ని దొంగిలించి ఆ సమాచారంతో తమకు కావాల్సిన వాళ్ల పేరుతో ఓటరు కార్డులు తయారు చేయించి యథేచ్ఛగా ఓట్లు వేసుకుని ఎన్నికల అక్రమాలకు కొత్త భాష్యం చెప్పింది వైసీపీ. అయితే ఆ ఎన్నికల్లో జరిగిన అక్రమాలకు సజీవ సాక్ష్యంగా ఇప్పటికీ అనేక వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అందుబాటులోనే ఉన్నాయి. అయినా ఎన్నికల సంఘం స్పందించలేదు. అయితే అత్త చచ్చిన ఆరు నెలలకు అల్లుడు ఏడ్చినట్లు మూడు సంవత్సరాల తర్వాత ఎన్నికల సంఘం స్పందించింది. అక్రమ ఓటరు కార్డులు డౌన్‌లోడ్ వెనుక ప్రమేయం, నిర్లక్ష్యం ఉందనే ఆరోపణలపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఏస్ గిరీషాను సస్పెండు చేసింది. మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డితో పాటు మరికొంత మంది రెవెన్యూ సిబ్బందిపైన చర్యలు తీసుకుంది. ఈ సంఘటన చూసిన జిల్లా వాసుల మదిలో తొలుస్తున్న అనుమానం ఒకటే. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాలుగైదు రోజులుగా అధికార పార్టీ నాయకులు జిల్లాలో పట్టపగలే ఎటువంటి భయం లేకుండా ఓటర్లకు జగనన్నకు ఓటేద్దాం.. పేరుతో చీర ఉన్న బ్యాగును పంపిణీ చేస్తున్నారు. ఆ బ్యాగు ఇస్తూ పెళ్ళిళ్లలో గ్రూపు ఫొటో తీసుకున్నట్లు ఫోజులు ఇస్తున్నారు. ఈ పంపిణీ వ్యవహారం పత్రికల్లో వస్తున్నా అధికారులు అడ్డుకోలేకున్నారు. ఒకటి రెండుచోట్ల అడ్డుకోవడానికి సాక్షాత్తు జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నా అధికార పార్టీ నాయకులు లెక్కచేయడం లేదు. బరితెగించి మరీ.. పబ్లిక్‌గా పంపిణీ చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల బరితెగింపు ఈసారి ఎవరిని బలి తీసుకుంటుందోనని.. అధికారులు లోలోపల హడలిపోతున్నారు.

సాధారణ ఎన్నికలు దాదాపు మరో 40 రోజుల్లో జరిగే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి రానుంది. దీంతో అధికార పార్టీ నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమాలకు తెరలేపారు. ఐదు సంవత్సరాల వైఎస్సార్ కాంగ్రెస్ పాలనపైన రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం తమపై వేధింపులకు దిగడంతో పాటు జీతం పెంచలేదనే ఆగ్రహం ఉద్యోగుల్లో ఉంది. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో గృహిణుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. నవరత్నాల అమలు గురించి ప్రభుత్వం ఎంత గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రభుత్వం పెట్టిన అనేక అడ్డదిడ్డమైన అంక్షల నేపథ్యంలో లబ్ధిదారుల సంఖ్య పెరగడం లేదు. కరెంటు బిల్లులు, సొంత ఇల్లు, సొంత కార్లు ఉన్న వాళ్లను నవరత్నాల పథకాలకు దూరం చేశారు. ఇటువంటి అంశాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చనడుస్తోంది. ఇవి చాలదన్నట్లు అక్రమంగా ఇసుక రవాణా చేయడం, మద్యం అమ్మకాలు, భూముల ఆక్రమణలు, దళితులపై దాడులు, పేదల భూములు కాజేయడం వంటి అనేక ఆరోపణలు అధికార పార్టీ నాయలకుపైన ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో గెలుపుపై అనుమానంతో అధికార పార్టీ నాయకులు ఓటర్ల ప్రలోభాలకు తెర లేపారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో నాలుగు రోజుల కిందట తొలుత పీలేరు పట్టణంలో అధికార పార్టీ నాయకులు ఓటర్లకు వైఎస్సార్ కాంగ్రెస్ జెండా రంగుతో ఉన్న బ్యాగును పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. అధికార పార్టీ నాయకులు పంపిణీ చేసిన బ్యాగులో పట్టు చీరలు ఉన్నాయి. ఈ పంపిణీలో అధికార పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొంటూ ఓటర్లకు బ్యాగు ఇస్తూ ఫొటోలు తీసుకుంటున్నారు. పీలేరు పట్టణంలో చీరల పంపిణీ విషయం పత్రికల్లో రావడంతో జిల్లా ఎన్నికల అధికారులు స్పందించారు. ఈ పంపిణీపై పూర్తి స్థాయిలో విచారించి నివేదకను పంపమని ఆదేశించారు. అధికారులు ఏమి నివేదిక పంపించారో? తెలియదు కానీ.. విచారణ అయితే చేసినట్లు తెలిసింది. అధికారులు స్పందించినా చీరల పంపిణీ మాత్రం ఆగలేదు. రెండోరోజు కూడా జరిగింది. ప్రస్తుతం రైల్వేకోడూరు నియోజకవర్గంలో పట్టుచీరల పంపిణీతో ఓటర్ల ప్రలోభ కార్యక్రమం యథేచ్ఛగా జరిగిపోతోంది. కాగా మంగళవారం పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయం నుంచ రాత్రి వరకు చీరలు పంపిణీ చేశారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కోసం జిల్లా అధికారులు దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల టీంను రెడీ చేశారు. వాళ్లందరికీ శిక్షణ కూడా పూర్తి చేశారు. పలువురు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు ఎన్నికల అధికారులకు చీరల పంపిణీపై ఫిర్యాదు చేస్తే తమ పరిస్థితి ఏంటనే ఆందోళనలో అధికారులు ఉన్నారు. అప్పుడు ఎన్నికల సంఘం ఏ విధంగా స్పందిస్తుందోనని హడలిపోతున్నారు. మరోవైపు అధికార పార్టీ నాయకుల చీరల పంపిణీని అడ్డుకోలేకున్నారు. అదేదో ఎన్నికల కోడ్ ఎంత త్వరగా వస్తే అంత మంచిదిరా దేవుడా..! అని మనసులో కోరుకుంటున్నారు.

గుర్రంకొండ మండలంలో జోరుగా చీరలు పంపిణీ

గుర్రంకొండ, మార్చి 5: ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి ఓట్లను తమ వైపు మళ్లించుకోవడం కోసం వైసీపీ నాయకులు తాయిలాలను ఎరగా వేస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లకు చీరలను పంపిణీ చేస్తున్నారు. గుర్రంకొండ మండలంలోని అన్ని పంచాయితీల్లో మంగళవారం ఉదయం నుంచి మహిళలకు చీరలను వైసీపీ నాయకులు, వలంటీర్లు దర్జాగా అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు తమ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లకు చీరలను ఇస్తున్నారు. ఇంటికి ఓ చీర చొప్పున ఇచ్చి వైసీపీకి ఓటు వేయాలంటూ కోరుతున్నారు. అంతేకాకుండా కొన్నిచోట్ల రేషన్‌కార్డుల ఆధారంగా కూడా చీరలను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ తంతు ఉదయం నుంచి రాత్రి వరకు నిరాటంకంగా జరగడం విశేషం. ఇంత జరుగుతున్నా అటువైపు చూసి చర్యలు తీసుకున్న అధికారులు లేకపోవడం గమనార్హం.



గుర్రంకొండలో ఓటర్లకు పంపిణీ చేస్తున్న చీరలు

సీనియర్ సిటిజెన్స్ చట్టం కింద లక్ష్మమ్మ దంపతులకు రక్షణ

మదనపల్లె టౌన్, మార్చి 5: మదనపల్లె అయోధ్యనగర్‌లో కొడుకు చేతిలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధ దంపతులు వెంకటరమణారెడ్డి, లక్ష్మమ్మలకు సీనియర్ సిటిజన్స్ చట్టం కింద అన్ని విధాలా రక్షణ కల్పిస్తామని ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మను ఆర్డీవో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు లక్ష్మమ్మను పరామర్శించడంతో పాటు ఆమెకు ధైర్యం చెప్పామన్నారు. ఇప్పటికే వెంకటరమణారెడ్డి, లక్ష్మమ్మలను దాడి చేసిన వారి కుమారుడు శ్రీనివాసులురెడ్డిపై పోలీసులు కేసు పెట్టి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. లక్ష్మమ్మ ఆరోగ్యం కుదుట పడ్డాక, ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయాలని, అంతవరకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించామన్నారు. వారు ఇంటికి వెళ్లిన తరువాత కూడా తగిన రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న లక్ష్మమ్మను పరామర్శిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..
కార్యకలాపాలు బంద్

- ఇన్‌చార్జ్‌తోనే కాలం వెల్లదీస్తున్న అధికారులు
- ఆయన లేకపోతే రిజిస్ట్రేషన్లన్నీ బంద్

మదనపల్లె, మార్చి 5: మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం కార్యకలాపాలు బంద్ అయ్యాయి. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ పూతలపట్టు రాజు విజయవాడకు వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో విక్రయ దస్తావేజులతో పాటు తాకట్టు (మార్ట్‌గేజ్), రద్దు డాక్యుమెంట్లు (రసీదు), జీపీలు, వీలునామాలు, భాగ పరిష్కార దస్తావేజులు నిలిచిపోయాయి. సాధారణంగా ఇక్కడి కార్యాలయంలో అన్ని రకాల డాక్యుమెంట్లు కలిపి రోజుకు 60-70 డాక్యుమెంట్లు జరుగుతున్నాయి. తద్వారా ప్రభుత్వానికి చలానా, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో రోజుకు సగటున రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలు ఆదాయం వస్తుంటుంది. వివిధ అవసరాలు, పనుల మీద రిజిస్ట్రేషన్లకు వచ్చిన వినియోగదారులు మధ్యాహ్నం వరకూ నిరీక్షించి వెనక్కి వెళ్లిపోయారు. మిగతా సిబ్బంది కూడా పని లేకపోవడంతో ఖాళీగా కూర్చున్నారు. వివిధ అవసరాల నిమిత్తం భూమి, స్థలాలు, నివాసాలు క్రయ, విక్రయాలు చేపట్టి రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూసిన వారంతా నిరుత్సాహంతో కొందరు వెనక్కి వెళ్లిపోగా, ఈ ప్రక్రియ పూర్తి చేసి బయటి దేశాలకు వెళ్లాల్సిన వారు కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్లుగా ఇక్కడ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో డివిజన్ కేంద్రమైన మదనపల్లెలో ఇన్‌చార్జ్‌ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిజిస్ట్రేషన్ల పరంగా పెద్ద కేంద్రమే కాదు ఆదాయంలోనూ జిల్లాలో ప్రథమస్థానంలో ఉంది. అలాంటి చోట ఏళ్ల తరబడి కూడా సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి ఆ శాఖ ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అవినీతి, అక్రమాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై తరచూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా చర్యలు శూన్యమని డాక్యుమెంటు రైటర్లు, ఇటు వినియోగదారులు వాపోతున్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉంటున్న రాజుపై కార్యాలయం మొత్తం ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తింది. చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన కొన్నేళ్లు డిప్యూటేషన్‌పై మదనపల్లెలో పనిచేస్తూ ఆ తర్వాత ఇక్కడికి బదిలీ అయినా అదే సీనియర్ అసిస్టెంట్‌గానే ఉంటూ కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. అనంతరం మధ్యలో ఏడాది పాటు చిన్నగొట్టిగల్లు నుంచి హేమంతరాజులు రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసినా తర్వాత ఆయన తిరిగి పూర్వ స్థానానికి వెళ్లారు. అప్పటి నుంచి కూడా ఈయనే ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. దీంతో ఇదే కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లు ఉన్నా ఉన్నతాధికారులు అవకాశం ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ ఉంటే, ఆయన సెలవుపై వెళ్లినా, లేక విధులపై వెళ్లినా కార్యాలయంలోనే మరొక సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తుంటారు. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు. సాధారణంగా అర్బన్, రూరల్‌కు రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండాల్సిన సెంటర్ ఇది. అయితే ఒక కార్యాలయం, ఒక ఇన్‌చార్జ్‌తోనే కాలం గడుపుతున్నారు. కాగా ఇక్కడ మరో సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు ఉండగా ఆయనకు ఎప్పుడూ ఇలాంటి బాధ్యతలు అప్పగించలేదు. ఆయనకు ఈసీలు, నకలు రాయడానికి, వాటికి ఫీజులు వసూలు చేయడానికి మాత్రమే అవకాశం కల్పించారు. శ్రీరాములుకు ఒకరోజు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినా సాంకేతిక పరిజ్ఞానం లేదని, రిజిస్ట్రేషన్లు చేయలేనని చేతులెత్తేసినట్లు చెబుతున్నారు. డివిజన్ కేంద్రంలో ఏళ్ల తరబడి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించకపోవడం, డాక్యుమెంట్ వెరిఫికేషన్, చెక్‌స్లిప్పు, ఆన్‌లైన్‌లో నమోదు, అసైన్ చేయడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయడం అన్నీ ఈయనపైనే ఆధారపడటంతో ఆయన లేకపోతే కార్యాలయమే మూత పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని, కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రళయకాళ రుద్రుడు
రాయచోటి వీరభద్రుడు

- దక్షిణకాశిగా పేరుగాంచిన రాయచోటి వీరభద్రాలయం
- ప్రారంభమైన వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

రాయచోటిటౌన్, మార్చి 5: దక్షిణ కాశిగా పేరుగాంచిన రుద్రుడు రాయచోటి వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8వ శతాబ్దానికి ముందు ఏర్పడిన వీరభద్రుడి ఆలయ సంక్షిప్త చరిత్ర ఇలా ఉంది. పరమ శివుడి జటాజూటము నుంచి ఉద్భవించిన ప్రళయకాళ వీరభద్రుడు శివుని ఆజ్ఞ మేరకు దక్షిణయాగం ధ్వంసం చేసి దక్ష సంహారం చేసి తన కర్తవ్యాన్ని పూర్తి చేశాడు. అనంతరం భూలోకములోని పరమేశ్వరుడి పుణ్యక్షేత్రాలన్నీ దర్శించుకుంటూ చిట్టచివరగా మాండవ్య మహాముని తపో బలముచే పునీతమైన మాండవ్య నది తీరాన భద్రకాళీ సమేత వీరభద్రుడి అలంకారంలో అవతార పరిసమాప్తి చేసి భక్తుల ఆరాధ్యుడిగా పిలవబడుతున్నాడు. వీరభద్రస్వామి ఆలయాలన్నిటికీ ఈ దివ్య క్షేత్రం మూలస్థానమై ప్రసిద్ధి చెందింది. అందుకే ఈ క్షేత్రాన్ని దక్షిణకాశిగా పిలుచుకుంటారు. ఎంతోమంది రాజాది రాజులెందరో ఈ పుణ్య క్షేత్రంలో విడిది చేసి వీర ఖడ్గములు సమర్పించి నిత్యం రాజోపచారములచే సేవించబడిన వీరభద్రస్వామి రాచరాయుడుగా పేరుగాంచారు. అందుచే రాచరాయుడు నివాసమైన ఈ ప్రాంతం రాచవీడుగా పేరుగాంచి కాలక్రమేణా రాయచోటిగా నామాంతరం పొందింది. ఇప్పటికీ కన్నడ భక్తులు ఈ ప్రాంతాన్ని రాచోటిగా పిలవడం గమనార్హం. ఈ విధముగా ప్రాచీన కాలంలోనే కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఆలయ నిర్మాణములు 8వ శతాబ్దంలో రాజాధిరాజ చోళుడు, 11వ శతాబ్దంలో కాకతీయ గణపతి దేవుడు, అనంతరం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయ నిర్మాణంతో పాటు జీర్ణోద్ధరణ కార్యక్రమాలు చేపట్టినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం కనపడుతున్న వీరభద్రుడి ఆలయ గర్భాలయం 14వ శతాబ్దంలో సదాశివ దేవరాయలుచే జీర్ణోద్ధరణ చేసినట్లు శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. రాచవీటి వీరభద్రస్వామి విశేషంగా వీరశైవులకు ఇలవేల్పుగా వెలిసియున్నారు. ఈ దివ్య క్షేత్రం వీరశైవ పుణ్య క్షేత్రముల్లో శ్రీశైలం తదుపరి ప్రథమ స్థానం వహించి కన్నడ, తమిళ, తెలుగు ప్రజల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్నాడు.

15 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగానే మంగళవారం కలశ స్థాపన, ధ్వజారోహణం, గోపూజలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి దంపతులతో పాటు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య, శంకరయ్యస్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు వీరభద్రుడి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు చండీ హోమం, పూలంగి, సేలంగి సేవ, 7న ఉదయం యాలివాహన ఉత్సవం, రాత్రి సింహవాహనోత్సవం, 8న ఉదయం రుద్రహోమం, మహాశివరాత్రి అభిషేకాలు, రాత్రి పురుష మృగవాహనం, 9న ఉదయం పరివార దేవతాహోమం, రాత్రికి రావణవాహనం, 10న ఉదయం చండీహోమం, రాత్రికి చంద్రప్రభ వాహనం ఉంటాయి. అలాగే 11న సోమవారం రాత్రి నంది వాహనోత్సవం, 12న మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, మధ్యాహ్నం 11.30 గంటలకు మహానైవేద్య ఘట్టం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, 14న బుధవారం అశ్వ వాహనోత్సవం, (పార్వేట ఉత్సవం) కార్యక్రమాలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇప్పటికే మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖాధికారులు భక్తులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

కైలాసనాథుడి అలంకారంలో అఘోరలింగేశ్వరుడు



వీరభద్రాలయం



నంది వాహనదారుడైన భద్రకాళీ సమేత వీరభద్రుడు



వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం

మల్లయ్యకొండకు 81 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 5: మహాశివరాత్రిని పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండకు మదనపల్లె ఆర్టీసీ-1 డిపో నుంచి 81 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో మదనపల్లె నుంచి 18 బస్సులు, బి.కొత్తకోట నుంచి రెండు బస్సులు, పెద్దమండ్యెం నుంచి రెండు బస్సులు, ములకలచెరువు నుంచి రెండు బస్సులు, తంబళ్లపల్లె నుంచి 8 బస్సులు, అంగళ్లు నుంచి 8 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే మల్లయ్యకొండ కింద నుంచి మల్లయ్యకొండపైకి 40 బస్సులు, మదనపల్లె నుంచి తిమ్మమ్మ మర్రిమానుకు మూడు బస్సులు, అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని శివభక్తులు, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకుని డీఎం కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన సుబ్రమణ్యామాచారి

ఎర్రగుంట్ల, మార్చి 5: ఎర్రగుంట్ల మండలంలోని పెన్నానది సమీపంలోని రెడ్ల కల్యాణమంటపం సమీపంలో ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో పోట్లదుర్తికి చెందిన కోవెలకుంట్ల సుబ్రమణ్యామాచారి (62) మృతి చెందాడు. మెకానిక్ పనిచేస్తున్న సుబ్రమణ్యామాచారి పోట్లదుర్తి నుంచి బైక్‌లో ప్రొద్దుటూరుకు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. రెడ్ల కల్యాణమంటపం వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన కట్టుడు రాళ్ల తీసుకెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతడి తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చాపాడు, మార్చి 5: మండలంలోని వీవీ కొట్టాలు గ్రామానికి చెందిన ఏనుగు సుబ్బారెడ్డి (39), విజయనగరం గ్రామానికి చెందిన ఒక యువతి (29) వేర్వేరు ఆస్పత్రులలో చికిత్స పొందుతూ ఈనెల 4న సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏనుగు సుబ్బారెడ్డి కడుపు నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగి కడపలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వరకట్నం కోసం వేధించడంతో గతనెల 21వ తేదీ యువతి పురుగుల మందు తాగి కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

కుక్కల దాడిలో రెండు దుప్పిలు మృతి


పంచనామా చేస్తున్న పశు వైద్యురాలు

నందలూరు, మార్చి 5: కుక్కల దాడిలో రెండు దుప్పిలు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. రాజంపేట ఫారెస్ట్ రేంజర్ రామాపురం నారాయణ కథనం మేరకు... నందలూరు బీట్‌లోని గట్టుమీదపల్లె వద్ద వీధి కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఒక్క దుప్పి, పాటూరు బీట్‌లోని రైల్వే ట్రాక్ సమీపంలో కుక్కలు తరమగా తప్పించుకుపోయే క్రమంలో పైనుండి కిందకు దూకి మరో దుప్పి మృతి చెందాయి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిశంకర్, బీట్ ఆఫీసర్లు ఇందిర, లింగారెడ్డిలు మృతి చెందిన రెండు దుప్పిలను మంగళవారం స్థానిక పశువైద్యశాలకు తరలించారు. మండల పశువైద్యురాలు స్నిగ్ధ ప్రణీత పంచనామా చేసిన అనంతరం దహన సంస్కారాలు నిర్వహించినట్లు ఫారెస్ట్ రేంజర్ నారాయణ తెలిపారు.

ఉద్యాన తోటకు నిప్పు

● కాలిన సపోట చెట్లు, డ్రిప్పు ● రూ.1.50 లక్షలు రైతుకు నష్టం



కాలిపోయిన సపోటా చెట్లు, కాలిన డ్రిప్పు పరికరాన్ని చూపుతున్న రైతు

సంబేపల్లె, మార్చి 5: వేసవి కాలం వచ్చిందంటే చాలు, ఉద్యాన రైతులకు నిప్పుతో నష్టాలు తప్పడం లేదు. కొంతమంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఉద్యాన తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు రైతులకు నష్టం వాటిల్లుతోంది. సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామం జానంబండ్లపల్లెకు చెందిన రైతు జానం వేణుగోపాల్ రెండు ఎకరాల్లో ఉద్యాన తోట సాగు చేశాడు. మంగళవారం గుర్తు తెలియని వారు నిప్పంటించడంతో 150 సపోటా చెట్లు, డ్రిప్ పరికరాలు, 40 మామిడి చెట్లు కాలిపోయినట్లు రైతు ఆవేదన చెందాడు. నాలుగు సంవత్సరాలుగా వాటిని సంరక్షిస్తూ ఉన్నట్లు తెలిపారు. కళ్ల ముందు నిప్పు అంటుకొని కాలిపోతున్నా నిస్సహాయ స్థితిలో ఉండిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని వేడుకొన్నాడు.

20 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, మార్చి 5 : మండల పరిధిలోని జంగంపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైవీయూలో ఉర్దూ భాషా దినోత్సవం


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ షావల్లిఖాన్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 5 : ఉర్దూ భాష చదివే వారికి అవకాశాలు, ఉద్యోగ ఉపాధి ఉన్నాయని వైవీయూ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షావల్లిఖాన్ తెలిపారు. మంగళవారం వైవీయూ హ్యూమానిటీ బ్లాక్‌లో ఉర్దూ శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ దినోత్సవాన్ని ప్రొఫెసరు కె.రియాజున్నీసా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా షావల్లిఖాన్ మాట్లాడుతూ ఉర్దూను అభ్యసించే వారికి వేమన విశ్వవిద్యాలయం ఒక చక్కటి వేదిక అన్నారు. ఉర్దూ శాఖాభివృద్ధికి అందరి సహకారం ఉండన్నారు. హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అరబిక్, పర్షియన్, టర్కీ భాషల నుంచి ఉర్దూ భాష పుట్టిందన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ప్రొఫెసరు రమాదేవి, పార్వతి, ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, ఖాజామైనుద్దీన్, నజీమున్నీసా, రెహనాపర్వీన్, సయ్యద్ ఇంతియాజ్, అహ్మద్ పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

● కోరంలేక కౌన్సిల్ సమావేశం వాయిదా ● ఆగ్రహంతో వెళ్లిపోయిన చైర్మన్



ఖాళీగా ఉన్న కుర్చీలు, అధికారులు మాత్రమే మిగిలిన దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 5: కౌన్సిలర్లు బహిష్కరించడంతో ఎర్రగుంట్ల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఎర్రగుంట్ల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే 11.20 అవుతున్నా ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి వచ్చారు. చైర్మన్ కూడా రాకపోవడంతో అందరూ ఎదురు చూశారు. చైర్మన్ వచ్చిన తర్వాత కోరం కోసం కొద్దిసేపు అధికారులు వేచి చూశారు. కాగా గత సమావేశంలో తాము వ్యతిరేకించిన అంశాలను, తాము వెళ్లిన తర్వాత ఆమోదించుకుని వాటిని కలెక్టర్‌కు కూడా పంపినట్లు కౌన్సిలర్లు నాగిరెడ్డి, ఆలి, మరికొందరు తెలుసుకున్నారు. ఈ అంశంపై ప్రశ్నించారు. గత సమావేశం మాదిరిగానే ఈ సమావేశంలో కూడా అన్ని అంశాలను మీరే ఆమోదించుకోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశాలకు తమను ఎందుకు పిలిచారంటూ వాకౌట్ చేశారు. ఇకపై తమను సమావేశాలకు పిలవొద్దని ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ అంటూ బయటికి వెళ్లిపోయారు. ఇది గమనించిన చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ బయటికి వెళ్లిపోయారు. దీంతో సమావేశ గదిలో ఖాళీ కుర్చీలు, అధికారులు మాత్రమే మిగిలారు. సమావేశాన్ని వాయిదా వేస్తున్నారా అని కమిషనర్ రామకృష్ణయ్యను అడుగగా అలాంటిదేమీ లేదని మళ్లీ కౌన్సిలర్లు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. అయితే అరగంట వరకు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో సమావేశం జరగలేదు. గత సమావేశంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నలుగురు కౌన్సిలర్లు ఈసారి కూడా తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు.

రూ.4కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు

● అదుపుకాని అధికార పార్టీ నేతల భూ దందా ● అడ్డంగా ఆక్రమణలు.. చోద్యం చూస్తున్న అధికారులు

అవకాశం ఉన్నపుడే అడ్డంగా దోచేయాలి. పెట్టుబడి లేకుండా అందినకాడికి సంపాదించుకోవాలనేది అధికార పార్టీ నేతలు బాగా వంటబట్టించుకున్నట్టు ఉన్నారు. బద్వేలు పట్టణంలో యథేచ్ఛగా భూఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాజాగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 1581లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన ఓ నేత ఆక్రమించారు.


No Objection Certificate

This is to certify that Sri Sura Veeranayana Reddy S/o Pedda Veera Reddy resident of Chennampalli is permitted to run a brick kiln unit in the scheduled land temporarily i.e up to completion of construction of houses in Layouts situated in Chennapalli village, Badvel Mandal under Navarathnalu – Pedalandarikillu Scheme so as to provide the bricks to the beneficiaries of said pertaining to Badvel Municipality at affordable prices. Hence, there is no objection to provide to power connection to the said brick kiln unit on temporary basis.

Note: This is issued only to secure power connection from APSPSDCL so as to run the brick kiln unit and it won't confer any rights to the said individual over scheduled land. Whenever the land is required, the individual may be evicted without any prior notice.

Scheduled Land

Revenue Village	Sy No	Extent in Acres	Boundaries
Chennampalli	1581-P	1.13Acres	East-Land situated in Sy No 1581; West- Road (Part in Sy No 1581); North-Road (Part in Sy No 1581); South-Land belongs to Dabbugunta Padmavathamma & Bhumireddy Krishnaveni

TAHSILDAR BADVEL

జగనన్న కాలనీలో ఇటుకల తయారీ కోసం ఎన్‌ఓసీ ఇచ్చిన అధికారులు

బద్వేలు, మార్చి 5: బద్వేలు పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో భూముల విలువ పెరుగుతూ వస్తోంది. దీంతో ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తాజాగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో మరో భూకబ్జా వెలుగుచూసింది. జగనన్న కాలనీకి సిమెంటు, ఇటుకలు వేసేందుకు కరెంటు మీటరు కోసం గత తహశీల్దారు ఎన్‌ఓసీ ఇచ్చారు. జగనన్న కాలనీకి సంబంధించిన సిమెంటు ఇటుకల సప్లై కోసం ఆ స్థలాన్ని తాత్కాలికంగా వాడుకునేందుకు అనుమతి ఇచ్చారు. అయితే ఆ ఎన్‌ఓసీని అడ్డం పెట్టుకుని అధికార పార్టీకి చెందిన ఓ నేత కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు.

సర్వే నెంబరు 1581లో 1.13 ఎకరాల స్థలంఉంది. ఆ స్థలంలో జగనన్నకాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల కోసం సిమెంటు ఇటుకల తయారీ కోసం తాత్కాలిక అనుమతి ఇచ్చారు. ఈ మేరకు కరెంటు కనెక్షన్ కూడా ఇచ్చారు. దీనికి సంబంధించి అధికారులు 'తాత్కాలిక అనుమతి అని, ఆ స్థలంపై ఎవ్వరికీ హక్కు ఉండదని' స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు చెన్నంపల్లె లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి అయింది. అయినా ఆ స్థలాన్ని ఖాళీ చేయకుండా అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ప్రహరీగోడ నిర్మిస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భూమి సుమారు రూ.4కోట్ల విలువ చేస్తుందని సమాచారం. రెండు రోజుల నుంచి ఇక్కడ ప్రహరీగోడ నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో జగనన్న కాలనీలో గుడి నిర్మించుకుంటుంటే రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని, ఇప్పుడు రూ.4కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. కబ్జాకు పాల్పడుతున్నది అధికార పార్టీ నేత కావడంతో అధికారులు చూసీచూడనట్టు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా, ప్రభుత్వ భూమి ఆక్రమణ గురించి తహశీల్దారు దామోదర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయం నా దృష్టికి రాలేదని అన్నారు. తక్షణమే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలు అడ్డుకుంటామన్నారు.



ప్రభుత్వ స్థలంలో ప్రహరీగోడ నిర్మిస్తున్న దృశ్యం

నైపుణ్యం పెంచుకునేందుకే శిక్షణ



శిక్షణ పొందుతున్న సివిల్, ఏఆర్ పోలీసులు

సిబ్బందికి శిక్షణలో ఏఆర్ ఏఎస్పీ కృష్ణారావు

కడప క్రైం, మార్చి 5 : రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఏఆర్ ఎస్పీ కృష్ణారావు తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో మంగళవారం సివిల్, ఏఆర్ సిబ్బందికి యాంటీరైట్స్ డ్రిల్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు సిబ్బందిలో నైపుణ్యం పెంపొందించేలా ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల వేళ వీరి సమయస్ఫూర్తి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఈ శిక్షణ మెరుగైన విధులు నిర్వహించేందుకు దోహదపడుతుందని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే అల్లరిమూకలపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అనంతరం అల్లరి మూకలపై ఎలా లాఠీచార్జ్ చేయాలి, గ్యాస్ ఎలా ప్రయోగించాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్ విరేష్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి గండి శివాలయం సంప్రోక్షణ


గండి క్షేత్రంలోని శివాలయం

చక్రాయపేట, మార్చి 5: గండి క్షేత్రంలోని పాపాఘ్ని పడమర దిక్కున వెలసిన శివాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్, కావలి హరినాథ్, కావలి కృష్ణతేజ, అప్పు రాజిత, శ్రావణ్, అహ్మద్‌ఖాన్, శ్రీహరిలు సమావేశమై ఈనెల 28, 29, 30 తేదీలలో అత్యంత వైభవంగా శివాలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ గుహలో వెలసిన శివాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కార్తీక మాసంలో వేలాది మంది మహిళలు స్వామివారిని దర్శించుకొని పాపాఘ్ని నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకునే వారు. అలాగే గండి క్షేత్రానికి వచ్చే భక్తులు తప్పకుండా శివాలయానికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో శివాలయంలో 70 సంవత్సరాలుగా సేవలందిస్తున్న పఠాన్ రామానంద కబీర్ ఇటీవల మృతిచెందడంతో ఆలయం మూతపడింది. అలాగే 2020లో కురిసిన భారీ వర్షాలకు శివాలయం పాక్షికంగా దెబ్బతింది. అనంతరం కరోనా రావడంతో శివాలయం తలుపులు తెరుచుకోలేదు. ఈ నేపథ్యంలో శ్రీయోగి రామానంద స్వామి చరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

చాందినీ బండ్లకు అనుమతి పొందాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగనాథబాబు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 5: లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి చాందినీబండ్లు కట్టేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని లక్కిరెడ్డపల్లె సీఐ జీవన్ గంగనాథ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో గంగమ్మజాతర జరుగుతుందని, ప్రశాంతంగా జరిగేందుకు అన్ని కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చాందినీబండ్లను 10 అడుగుల ఎత్తు కంటే ఎక్కువ ఏర్పాటు చేయకూడదని తెలిపారు. బండి వెనుక అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయొద్దని, కేవలం సంప్రదాయబద్ధంగా చాందినీ బండ్లు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకోవాలన్నారు. చాందినీ బండ్ల వద్ద బాణసంచా కాల్చేటపుడు తగిన జాగ్రతలు పాటించాలని అలాగే బండి వచ్చే సమయంలో విద్యుత్ తీగలు బండికి తగలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దొంగతనాలు, జూదాలు, మద్యం విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులు అదుపులో తీసుకుని అరెస్టు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాతరకు నాలుగు మూలల స్టాండ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయి


టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మణికంఠ

కడప (స్పోర్ట్స్) మార్చి 5: సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ తెలిపారు. యువత ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నెహ్రూ యువకేంద్ర, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడాస్ఫూర్తిని పెంచుకుంటే ధైర్యసాహసాలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించేందుకు శ్రమించాలన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

టగ్ ఆఫ్ వార్ క్రీడా పోటీలో విజేతగా నిలిచిన శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని, ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకులు అశోక్, ఎన్‌వైకె వలంటీర్లు బాలాజీ, కళ్యాణ్, దినేష్, సాయిశ్వర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో జర్నలిస్టుల పాత్ర కీలకం : కమిషనర్

కడప (కలెక్టరేట్), మార్చి 5: రానున్న సాధారణ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని నగరపాలక సంస్థ కమిషనరు ప్రవీణ్‌చంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఎంసీఎంసీ, మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల్లో మీడియా పాత్రపై ఎంసీఎంసీ మెంబరు గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నగర కమిషనరుతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి, ఎంసీఎంసీ మెంబరు సెక్రెటరీ వేణుగోపాలరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇందుకు మీడియా కీలకపాత్ర పోషించాలన్నారు. ఎన్నికల్లో అబ్జర్వర్లు, ఎక్స్‌పెండెచర్ లాగానే మీడియా కూడా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటించేలా మీడియా యాక్టివ్ రోల్ పోషించాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని తెలిపారు. ఏదైనా ఒక వార్తను ప్రచురించే ముందు వాస్తవాలు సరి చూసుకుని ప్రచురించాలన్నారు. అవాస్తవ కథనాలు స్ప్రెడ్ కాకుండా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఐఅండ్ పీఆర్ ద్వారా మీడియాకు తెలియజేస్తామని తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రకటనలు, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సినిమా హాల్లో ప్రకటనలు, ఈ-పేపర్లలో, రేడియోలలో ముందుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకొని ప్రచురించాలన్నారు. అసభ్యకరమైన లేదా పరువు నష్టం కలిగించే ఏదైనా హింసను ప్రేరేపించడం, కోర్టు ధిక్కారానికి, దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కల్గించే వార్తా కథనాలతో పాటు వ్యక్తిగత విమర్శలు ప్రచురించరాదన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో మస్తాన్ సాహెబ్, సునీల్ సాగర్, ఎన్నికల సూపరింటెండెంట్, సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆరుగురు జూదరుల అరెస్టు

● రూ.49,750 నగదు స్వాధీనం

రామాపురం, మార్చి 5: మండలంలోని రాచపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లె తూర్పు భాగంలోని కంప పొదల్లో మంగళవారం జూదం ఆడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.49,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ముందస్తు సమాచారం మేరకు రాచపల్లెగ్రామం బాలిరెడ్డిగారిపల్లె సమీపంలోనే తూర్పు భాగంలో కంప పొదల్లో జూదం ఆడుతున్నారని తమకు సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బందితో వెళ్లి జూదం ఆడుతున్న మద్దూరి రెడ్డెయ్య మరో ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా పూలభాస్కర్



రాజంపేటటౌన్, మార్చి 5: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూలభాస్కర్‌ను నియమిస్తున్నట్లు పీసీసీ మీడియా కన్వీనర్ ఎన్.తులసిరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పీసీసీ అధికార ప్రతినిధిగా నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు పల్లంరాజు, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి గౌతమ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

రైల్వేకోడూరు, మార్చి 5: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు న్యాయస్థానం జడ్జి ఎం.అంజనీప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా వాయిదా వేసి 16న నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ కాదగిన కేసులు ఉంటే పరిష్కారం చేసుకోవాలని, సమయం వృథా కాకుండా కేసులు సత్వరం పరిష్కారం చేసుకునేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

ఆదర్శ జీవన విధానాన్ని అనుసరిద్దాం

ఓబులవారిపల్లె, మార్చి 5: తమ జీవన విధానం ద్వారా లోకులందరికీ ఆదర్శప్రాయులైన సీతారాముల గురించి తెలిపే రామాయణ ఇతిహాసం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, తద్వారా ఆదర్శవంతమైన జీవన విధానాన్ని అనుసరిద్దామని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని కటికంవారిపల్లె శ్రీకృష్ణ మందిరంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న ధార్మిక ఉపన్యాసాలలో భాగంగా మొదటి రోజైన మంగళవారం ఆయన రామాయణ విశిష్టతపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు లీలావతమ్మ, కటికం జయమ్మ, పుల్లగంటి వెంకటసుబ్బమ్మ, సావిత్రమ్మ, అరిగెల శ్రీనివాసులు, కటికం ధనుంజయ, కటికం నాగేంద్ర, అరిగెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ఒంటిమిట్ట, మాజీ 5: మండల పరిధిలోని గంగపేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవం రెండు వర్గాల మధ్య వివాదాస్పదమైన ప్రారంభోత్సవాన్ని మంగళవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. గత కొద్ది నెలల క్రితం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డిజిటల్ లైబ్రరీ ప్రారంభించకుండా అలాగే ఉండటంతో మంగళవారం ప్రారంభించాలని స్థానిక అధికారులు నిర్ణయించారు. ఎలాంటి ఘటన చోటు చేసుకోకుండా డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు ఆధ్వర్యంలో దాదాపు 20 మంది పోలీసులు బందోబస్తు ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐలు మధుసూధన్‌రావు, పెద్ద బాబన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు : డీఎస్పీ

ములకలచెరువు, మార్చి 5: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించి పలు రికార్డులు తనిఖీ చేశారు. అలాగే ములకలచెరువు, పాత ములకలచెరువులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌కుమార్, సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి ఉన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి : ఎంఈఓ

బికొత్తకోట, మార్చి 5: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలోనూ 25 శాతం ఉచిత ప్రవేశాలు ఉంటాయన్నారు. కలెక్టర్, విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సచివాలయం, ఎంఈఓ కార్యాలయం, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

బూత్ ఇన్‌చార్జ్‌లే పార్టీకి పట్టుకొమ్మలు

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



బీదవాండ్లపల్లె గ్రామంలో ఇంటింటికి పర్యటిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 5: పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జులే పార్టీకి పట్టుకొమ్మలని, కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని బూత్ ఇన్‌చార్జులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌చార్జి సైనికుడిలా పనిచేయాలని, బూత్‌ల వారీగా ప్రతి కార్యకర్తను టీడీపీ కుటుంబ సభ్యులను కలుపుకొని టీడీపీ విజయకేతనం ఎగుర వేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను, ప్రతి కుటుంబ సభ్యులను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటానని తెలిపారు. ఇందులో భాగంగానే బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ కిట్లను, వాటి ప్రాముఖ్యతను తెలియజేసి గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని బూత్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జిలతో పాటు పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ మద్దతు పలికి కృషి చేయాలని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె పంచాయతీ బీదవాండ్లపల్లె, సరస్వతిపల్లె గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రాజంపేట టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గడికోట భాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద కలిసి తన విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం రాచపల్లె పంచాయతీ బీదవాళ్లపల్లెలోని టీడీపీ అభిమాని మోహన్‌నాయుడు సతీమణి రాణెమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఆనంతరెడ్డి, టీడీపీ నాయకులు భాస్కర్‌నాయుడు, అన్నమయ్య, శివయ్య, మరికొందరు నాయకులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆటోలు

● బస్టాండు కూడలిలో ట్రాఫిక్ జామ్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అస్తవ్యస్తంగా నిలబెట్టిన ఆటోలు



ఆటోలు అడ్డుగా ఉండటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన దృశ్యం

నందలూరు, మార్చి 5: బస్టాండు కూడలిలో అస్తవ్యస్తంగా ఆటోలు నిలబడటం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు ఎన్ని మార్లు హెచ్చరించినా ఆటో డ్రైవర్ల వైఖరి మారడం లేదు. పలువురు డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేవు. 18 సంవత్సరాలలోపుపిల్లలు సైతం ఆటోలు నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. కడప, రాజంపేట వైపు బస్సులు ఆగిన సమయంలో ప్రయాణికులు దిగిన వెంటనే ఆటోలు అడ్డుపెట్టడం వల్ల పలువురు వివిధ రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటారు వాహన అధికారులు, స్థానిక పోలీసులు చర్యలు తీసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

ముగింపు సభను జయప్రదం చేయండి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటి టౌన్, మార్చి 5: హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభలను జయప్రదం చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ముగింపు సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా పౌరహక్కుల సంఘం సమాజంలో నెలకొని ఉన్న అసమానతలను రూపుమాపేందుకు కృషి చేస్తోందన్నారు. అంతేగాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని పోరాడుతూనే ఉందన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా, తీవ్ర నిర్బంధ పరిస్థితులు ఎదుర్కొంటూనే పౌర హక్కుల సంఘం ప్రజల వైపు ప్రశ్నిస్తూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, సహాయ కార్యదర్శి ఎం.రవిశకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి'



రాజంపేట ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రైల్వేకోడూరు, మార్చి 5: ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. మంగళవారం రాజంపేట ఆర్‌డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ కబ్జాదారులకు రెవెన్యూ శాఖాధికారులు తొత్తులుగా మారుతున్నారని, రైల్వేకోడూరు మండలం ఉప్పరపల్లె పంచాయితీ పరిధిలో సర్వే నెంబరు 2367లో దాదాపు 12 ఎకరాలను మాధవరంపోడు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యవసాయ కార్మిక అధ్యక్ష, కార్యదర్శులు రేవూరి శంకరయ్య, చలంపాటి నరసింహులు, నాయకులు షేక్ హాజమాబి, వేడుక వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటుకు భూమిపూజ

పెనగలూరు, మార్చి 5: మండలంలోని కట్టావారిపల్లె హరిజనవాడలో ఏపీఎండీసీ నిధులతో ఆర్వో ప్లాంటు నిర్మించేందుకు ఎమ్మెల్యే శ్రీనివాసులు మంగళవారం భూమి పూజ చేశారు. ఆగమేఘాల మీద తలపెట్టిన ఈ కార్యక్రమానికి ద్వితీయ శ్రేణి వైసీపీ నాయకులు, కొంత మంది సచివాలయ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. అయితే ఇన్నిరోజులు లేనిది ఇప్పుడు ప్లాంటు ప్రారంభానికి భూమిపూజ చేయడంతో ఇది ఎన్నికల స్టంటే అని పలువురు చర్చించుకున్నారు.

ఏపీ మోడల్‌లో సృజనాత్మక విద్య



ప్రధానోపాధ్యాయురాలికి అప్లికేషన్ ఫామ్ అంజేస్తున్న ప్రిన్సిపల్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 5: ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మంచి సృజనాత్మక విద్యనందిస్తున్నామని, మీ పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చౌటపల్లె, గొల్లపల్లె, అనంతపురం, అప్పకొండయ్యగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, చింతకుంటవాండ్లపల్లెలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి అప్లికేషన్ ఫామ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది 6వ తరగతి నుంచి ఆంగ్ల బోధనతో పాటు, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ కోర్సులు, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు లైబ్రరీలో రామాయణం, భారతం, పురాణ ఇతిహాసాలు, పుస్తకాలు చదివించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను మోడల్ స్కూల్‌లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచండి



ఆర్డీవోకు సమస్యలను విన్నవిస్తున్న పలు రాజకీయ పార్టీల నేతలు

రాజంపేట, మార్చి 5: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గతంలో జరిగిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటికి భద్రత పెంచాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని మంగళవారం ఆర్డీవో మోహన్‌రావుకు పలు రాజకీయ పార్టీలు అభ్యర్థించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పలు పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీ నాయకులు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఇష్టానుసారం ఓట్లు వేశారని, అలాంటి పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటికి భద్రత పెంచాలన్నారు. అలాగే అధికార పార్టీ నాయకులు ఇప్పటికే అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి స్పందించిన ఆర్డీవో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు గడువు ముగిసిందని, ఎటువంటి పరిస్థితుల్లో పోలింగ్ మార్పులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులే కీలకం

మదనపల్లెటౌన్, మార్చి 5: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టోరి యల్ అధికారులదే కీలక బాధ్యత అని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 259 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిని 38 సెక్టార్లుగా విభ జించామని ప్రతి సెక్టార్‌కు ఒక సెక్టోరియల్ అధికారి ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల సందర్శన, అక్కడ సదుపాయాలను పరిశీలించి సెక్టోరియల్ అధికారులు సర్టిఫై చేయాలన్నారు. ఈవీఎంల ఏర్పాటు, పోలింగ్ సమయంలో ఈవీఎంలు మరమ్మతు వస్తే వాటిని రీప్లేస్ చేయడం సెక్టోరియల్ అధికారుల బాధ్యత అన్నారు. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో, ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఇరువురికి బెస్ట్ ఉమెన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అవార్డు

మదనపల్లె అర్బన్, మార్చి 5: మదనపల్లెకు చెందిన ఇద్దరు డాక్టర్లు వలిగట్ల దివ్య, దీప్తిలు ఉత్తమ ఉమెన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అవార్డులు అందుకొన్నారు. మంగళవారం వోవ్, కేరళ హిమాలయ, వైద్యరత్న భోపాల్ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో దక్షిణ భారతదేశం నుంచి డాక్టర్లు వలిగట్ల దివ్య, దీప్తిలు అవార్డుకు ఎంపిక కావడం గర్వించదగ విషయమని హిమాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. మదనపల్లెలో గత ఐదేళ్లుగా బెటర్‌లైఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మోకాలి నొప్పి, వెన్నునొప్పి, సొరియాసిస్ తదితర ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేస్తూ మంచి పేరును సంపాదించారని చెప్పారు. ఇప్పటి వరకు డాక్టర్లు పది ఉచిత వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించారని తెలిపారు. వీరిని తొటి డాక్టర్లు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 5: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు మస్తాన్, రోహిత్ రూపొందించిన రెయిన్‌పాల్ డిటెక్టర్ క్రాప్ ప్రొటెక్టర్ అను ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోధ్యాయుడు నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనలో వీరు ప్రదర్శించారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థులను, గైడ్ టీచర్ మార్ల ఓబుల్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. వీరు రూపొందించిన ప్రాజెక్టు స్థానిక వాతావరణ పరిస్థితులను అంచనా వేసి అకాల వర్షాలను గుర్తిస్తుందన్నారు. దీనివల్ల రైతులు, ఇటుకలు వేసేవారు, భవన నిర్మాణం చేపట్టేవారు, అకాల వర్షాల ద్వారా జరిగే నష్టాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయసారధిరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు రవిశంకర్, రామయ్య, ఉమాదేవి, నబీసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

● రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా



రక్తదానం చేస్తున్న అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటి టౌన్,మార్చి 5: ఒకరు చేసే రక్తదానం మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం రాయచోటి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకత గురించి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మూడు నెలలకొకసారి రక్తదానం చేయడం వల్ల సదరు వ్యక్తి ఆరోగ్యంగా ఉండడంతో పాటు, మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. మనిషి దినచర్య సక్రమంగా జరగాలంటే రక్త ప్రసరణ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు పీఎస్ హరినాధరెడ్డి, మాజీ అధ్యక్షుడు మహమ్మద్, కోశాధికారి హరీష్‌చంద్ర, నారాయణరెడ్డి, చాన్‌బాషా, రక్తదాతలు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికతను జోడించాలి



విద్యార్థులతో కలిసి వెబ్ ఎక్స్ మీటింగ్‌లో పాల్గొన్న డీఈవో

సంబేపల్లె, మార్చి 5: బోధనలో నూతనత్వం జోడించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ప్రిన్సిపాల్ సెక్రటరీ వెబెక్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యా విధానం వలన బోధనతో పాటు అభ్యసనం కూడా సులభం జరుగుతుందన్నారు. అందుకోసం ప్రభుత్వం అందించిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ఉపయోగించి ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించే సమయం ఎక్కువగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు




విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ అశోక్‌రెడ్డి

గాలివీడు, మార్చి 5: రాబోయే కాలంలో దేశ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతుల్లోనే ఉన్నదని మహదేవ్‌పల్లి నరసింహారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత వారం క్రితం పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానం వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్తు గురించి త్వరలో జరగబోయే పదవ తరతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు పేదవారని, వారు ప్రతిరోజు కష్టపడి సంపాదించిన డబ్బులతో చదివిస్తున్నారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, పట్టుదలతో చదవాలని తెలియజేశారు. ప్రతిఒక్కరూ కష్టపడి చదివి మీ ప్రాంతానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీ పరీక్షల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పబ్లిక్ పరీక్షల్లో అవసరమయ్యే మెటీరియల్స్‌ను అందజేశారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, మార్చి 5: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. కాగా గత మూడేళ్లుగా సమావేశానికి హాజరు కాని ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి జనార్ధన్‌రెడ్డి మృతి చెందడంతో మంగళవారం హాజరయ్యారు. వైసీపీలో రెండు వర్గాలుగా గత కొద్ది రోజులుగా మండలంలో చలామణి అవుతుండటంతో మంగళవారం జరిగిన సమావేశానికి జడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి వర్గం హాజరయ్యారు. ముందుగా ఇన్‌చార్జి ఎంపీపీ గడ్డం జనార్ధన్‌రెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సమావేశాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు నామమాత్రంగా మాత్రమే హాజరయ్యారు. ప్రధానంగా వేసవికాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. గత సమావేశంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఇతరులను ఎవరినీ అనుమతించకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ హిమశ్వేత, ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ ఏఈ సుబ్రమణ్యం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి

సంబేపల్లె, మార్చి 5: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని గుట్టపల్లె బస్టాప్ సమీపంలో మంగళవారం స్కూటర్‌ను ఐచర్ బండి ఢీకొనడంతో ముబారక్ బాషా అనే చిరువ్యాపారికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం అదే గ్రామానికి చెందిన ముబారక్ బాషా ద్విచక్ర వాహనంపై చిరుబండారాల వ్యాపారం చేసుకునేవారు. వ్యాపారం ముగించుకుని రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలాలపై జంట ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా తోట



రామకుప్పం, మార్చి 5: మండల అటవీ సరిహద్దులో జంట ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా జంట ఏనుగులు సోమవారం రాత్రి ముద్దనపల్లె, బిరుగుండ్లపల్లె గ్రామాల సమీప పొలాలు, తోటల్లో తిరుగుతూ విధ్వంసం సృష్టించాయి. టమోటా, అరటి, దోస, వరి, రాగి పొలాల్లో సంచరిస్తూ తిన్నంతగా తిని ధ్వంసం చేశాయి. అటవీ అధికారులు వాటిని ట్రాకర్ల సాయంతో అడవిలోకి మళ్లించారు.

జగన్‌ను బలపరచేవారు చేతులెత్తండి

● ప్రభుత్వ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప వ్యాఖ్యలు

● సోషల్ మీడియాలో వైరల్

కుప్పం, మార్చి 5: 'జగన్మోహన్‌రెడ్డిని బలపరచాలా వద్దా? బలపరిచే వారు చేతులెత్తండి' అంటూ ఒక ప్రభుత్వ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుప్పం మండల సచివాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ముందుస్తుగా జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డెప్ప ప్రసంగం పక్కా ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. 'మిమ్మల్నందరినీ ఒకేఒక చిన్న ప్రశ్న అడుగుతాను. దయచేసి మనసులో ఏముందో తెలియజేయండి. ఇక్కడ ఎమ్మెల్యేగా నిలబడుతున్న భరత్.. ఎంపీగా నిలబడుతున్న నేను ఉన్నాను. ఎన్నికలు జరిగితే ఆదరణ ఎవరికి ఇస్తారు? రేపు ఎన్నికలు జరిగితే ఎమ్మెల్యేగా.. (మాటలు కట్) మరీమరీ ప్రార్థిస్తున్నాను' అంటూ ఆ వాక్యం ముగిసింది. 'మీ ఇష్టం. జగన్మోహన్‌రెడ్డిని బలపరచాలా, వద్దా? బలపరచాలన్నవారు చేతులెత్తండి' అని అభ్యర్థించారు. సమావేశానికి హాజరైన అంగన్వాడీల్లో కొందరు విధిలేని పరిస్థితుల్లో చేతులెత్తారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ముసిముసిగా నవ్వుకుంటూ ఉండిపోయారు. ఎంపీ ఎన్నికల ప్రసంగం అధికారులకు మాత్రం ఉద్యోగ సంకటంగా తయారైంది.

నిర్దిష్ట ప్రణాళికతోనే రైతులకు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకులు రమణ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 5: వ్యవసాయ రంగంలో నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసినప్పుడే రైతులకు ప్రయోజనం కలుగుతుందని తిరుపతి పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు ఏరువాక కేంద్రంలో శాస్త్రవేత్తల 40వ జిల్లా స్థాయి సమన్వయకర్తల సమావేశంలో రమణ, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ అధికారి ముకుందరావు మాట్లాడారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, పట్టు పరిశ్రమ రంగాల్లో రైతులకు కలిగే ప్రయోజనాలు, సాగులో పాటించాల్సిన మెలకువలు, పంటలను కాపాడుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యాన శాఖ అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్, మధుసూదన్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రెడ్డిరాము, సుమతి, జాన్, విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 13,329 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 5: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 13,329 మంది విద్యార్థులు హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 14,012 మంది విద్యార్థులకు గాను 13,329 మంది హాజరు కాగా, 683 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. డీవీఈవో నాలుగు, జిల్లా కమిటీ సభ్యులు 10, స్క్వాడ్ ఎనిమిది సెంటర్లను పరిశీలించారు. కాగా మంగళవారం టెట్ జరగలేదు.

రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

విజయపురం, మార్చి 5: విజయపురం మండలం కోసలనగరం పంచాయతీలో ఏపీఐఐసీకీ భూములు అప్పగించిన రైతులకు మంగళవారం మంత్రి రోజా చెక్కులు పంపిణీ చేశారు. మొదటి విడతగా 1541.41 ఎకరాల భూమిని రైతులు ఏపీఐఐసీకీ అప్పగించారు. వీటిలో రహదారులు వేయడానికి 29.69 ఎకరాలకుగాను రూ.9.64 లక్షలు చొప్పున 27 మందికి రూ.2.40 కోట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కన్నెమ్మ, సర్పంచ్ ఉమామహేశ్వరి, ఆర్బీకే ఛైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావ్, నాయకులు శేఖర్‌రాజు, హరికృష్ణ, చెంచువరప్రసాద్, పెద్దగొళ్ల, సోమశేఖర్, రవివర్మ, నారపరాజు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి రోజాకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

వైసీపీ అధిష్ఠానానికి నగరి వైసీపీ నేతల అల్టిమేటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: మంత్రి రోజాకు నగరి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని నియోజకవర్గ వైసీపీ నాయకులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డితో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు రెడ్డివారి భాస్కర రెడ్డి, ఏలుమలై, రవి, శేఖర్‌రాజు,వాసుదేవరెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్‌రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రోజాను గెలిపించడానికి ఆస్తులమ్ముకుని కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. తనకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభలో ఊదరగొట్టిన రోజా ఇపుడు తమనే ఇబ్బందులపాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి పాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్ లెగ్‌గా పేరు పొందిన రోజాను గోల్డెన్‌లెగ్‌గా మార్చి 2014లో ఎమ్మెల్యేని చేశామన్నారు.నగరి నియోజకవర్గాన్ని తన అక్రమార్జనకు అడ్డాగా చేసుకున్న మంత్రి రోజా తమను పక్కకు నెట్టేసిందన్నారు. నగరి ప్రజలు ఆమె పట్ల సానుకూలంగా లేరన్నారు. వైసీపీ అధిష్ఠానం ప్రజాభీష్టంతో పాటు క్యాడర్ విజ్ఞప్తిని మన్నించి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇతరులకు కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. అలాకాదని రోజాకే సీటు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తమపై నిందారోపణలు చేస్తున్న మంత్రి రోజా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

అనారోగ్యంతో ఆడసింహం మృతి



మృతి చెందిన సింహం

తిరుపతి(మంగళం), మార్చి 5: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల (జూ)లో ఓ ఆడ సింహం అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో జన్మించిన ఈ సింహం ఏడాది కాలంగా ట్యూమర్ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో మెరుగైన వైద్యమందిస్తున్నా కోలుకోలేదన్నారు. క్రమేణా ఆరోగ్యం క్షీణించి నాలుగు రోజులుగా ఆహారం కూడా తీసుకోలేదని తెలిపారు. చివరకు తీవ్ర అనారోగ్యానికి గురై చనిపోయిందన్నారు. కళేబరాన్ని పంచనామ నిమిత్తం ఎస్వీ వెటర్నిటీ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

బెస్తపల్లెలో అడవి పందుల బీభత్సం



బెస్తపల్లె వద్ద బావిలో పడ్డ అడవి పందులు

ఐరాల, మార్చి 5: ఐరాలకు కూతవేటు దూరంలోని బస్తపల్లెలో మంగళవారం అడవి పందులు బీభత్సం సృష్టించాయి. అడవి పందుల గుంపు నీటి కోసం గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు వేకువజామున వచ్చాయి. ఈ క్రమంలో అడవి పందుల గుంపు గ్రామం ముందున్న ఓ నేల బావిలో ఒకదాని తరువాత ఒకటి పడిపోయాయి. ఉదయం వెలుతురు వచ్చిన తర్వాత అడవి పందులు భయానికి గురై ఉదయం 5గంటల నుంచి ప్రయత్నించి 9గంటల ప్రాంతంలో బయటపడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన బెస్తపల్లె గ్రామస్తులు భయంతో కేకలు వేయడంతో అడవి పందులు గ్రామంలోని ఇళ్లల్లోకి ప్రవేశించాయి. దీంతో గ్రామస్తులు తమ ఇళ్లకు తలుపులు బిడాయించుకున్నారు. అడవి పందులు ఇళ్ల తలుపులను తలలతో గుద్ది గ్రామంలో అటు ఇటు పరుగు తీశాయి. వీధుల్లో ఉన్న ద్విచక్ర వాహనాలను దొర్లించాయి. సుమారు గంటపాటు గ్రామంలో బీభత్సం సృష్టించాయి. ఆ తర్వాత సమీపంలోని అడవిలోకి పరుగులు తీయడంతో గ్రామస్తులు ఊపిరి తీసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు విచ్చేసి అడవి పందులు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

శివరాత్రి ఉత్సవాల్లో భూతరాత్రి ఏకాంతం



ఆలయంలోనే ఆదిదంపతుల ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, మార్చి 5: వాయులింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం జరగాల్సిన భూత రాత్రి మొదటి వాహన సేవ ఏకాంతంగా జరిగింది. మంగళవారం రాత్రి స్వామివారు భూత, అమ్మవారు శుక (చిలుక)వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనం ఇవ్వాల్సి ఉంది. కానీ మాడ వీధుల్లోని నెహ్రూ రోడ్డుకు ఆనుకుని ఉన్న జెట్టిపాలెం సందులో ఒకరు శివైక్యం చెందారు. సంప్రోక్షణకు సమయం సరిపోకపోవడంతో ఆగమ నియమం ప్రకారం భూత వాహన సేవను ఏకాంతంగా మార్చారు.ఆలయంలోపలే ఉత్సవమూర్తులను ప్రదక్షిణ పూర్వకంగా తిప్పి తిరిగి కొలువుదీర్చారు.మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖరుడి రాజసం, చప్పరంపై జ్ఞానాంబిక అమ్మవారి వైభవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు.

'పుంగనూరు'కు కేంద్ర బలగాలు పంపండి

● ఏకపక్షంగా అధికారులు, పోలీసుల వైఖరి ● మంత్రి పెద్దిరెడ్డి అక్రమాలను నియంత్రించండి

● కేంద్ర ఎన్నికల సంఘానికి బీసీవైపీ అధినేత ఫిర్యాదు

పుంగనూరు, మార్చి 5: 'పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వోద్యోగులు మంత్రి పెద్దిరెడ్డి అండ్ కోకు ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్నారు. వీరి ద్వారా దొంగ ఓట్లకు కుట్ర జరుగుతోంది. అందుకని పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర బలగాలను పంపించాలి. పోలింగ్ బూత్‌లలో వీడియోగ్రఫీ, నిఘా ఏర్పాటు చేయాలి' అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ లేఖ రాశారు. గతంలో ఎన్నికల సమయంలో బూత్ ఏజెంట్లకు బెదిరింపులు, బలవంతం చేయడం వంటి ఘటనలతోపాటు కొన్ని పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కూడా నివేదికలు ఉన్నాయని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందిని మేనేజ్ చేసుకుని దొంగ ఓట్లు కూడా వేయించుకున్నారని ఆరోపించారు. పుంగనూరు అసెంబ్లీ ప్రాంతానికి 5 కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిహద్దు ప్రాంతం కర్ణాటక రాష్ట్ర ప్రజలను తీసుకొచ్చి బోగస్ ఓట్లు వేయించారన్నారు. గత పోలింగ్‌లో జరిగిన ఉల్లంఘనపై అనేక ఫిర్యాదులు వచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల స్కామ్ ద్వారా దొంగ ఓట్ల పోలింగ్ జరిగిందని, ఇప్పుడు అదే మాదిరిగా పుంగనూరులోనూ జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల కోడ్ రాకముందే ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీసులు అక్రమంగా సెర్చ్ వారెంట్ తెచ్చి తన నివాసాల్లో తనిఖీలు చేశారని, కేసులు బనాయించారని తెలిపారు. ఇక, పుంగనూరులో ప్రతిపక్షాలపైనే తప్పుడు కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందని పేర్కొన్నారు. అందుకని ఈ ఎన్నికలకు కేంద్ర బలగాలను పంపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు నిరోధించేలా గట్టి చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. గతంలో పెద్దిరెడ్డికి అనుకూలంగా ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఉన్న రిషాంత్ రెడ్డి, గతంలో పలమనేరు డీఎస్పీ, ప్రస్తుతం చిత్తూరు ఎస్బీలో పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి, పుంగనూరు సీఐగా పనిచేసి ప్రస్తుతం చిత్తూరు సీఐగా ఉన్న గంగిరెడ్డి, పోలీసు అధికారులు మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, తహసీల్దారు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్పీ జాషువా, మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి అధికారపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీవారి సెంటిమెంట్‌తో టికెట్ కోసం...

చంద్రబాబుకు నరసింహయాదవ్ లేఖ

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవుల కోసం, అవకాశాల కోసం నేతలు రకరకాల మార్గాలు ఎంచుకోవడం పరిపాటి. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ కూడా తిరుపతి టీడీపీ టికెట్ కోసం శ్రీవారి సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొచ్చారు. తిరుమలలో శ్రీవారు యాదవులకు తొలి దర్శన భాగ్యం కల్పించారని... అలాగే తిరుపతిలో ఎమ్మెల్యేగా యాదవులకు తొలిసారి అవకాశం కల్పించాలంటూ అధినేత చంద్రబాబును అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన ఓ లేఖను మంగళగిరిలో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సు వేదికపై చంద్రబాబుకు అందజేశారు. తిరుమల, తిరుపతిలకు చెందిన యాదవులతో వెంకటేశ్వర స్వామికి బంధం వుందని పేర్కొన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన తనకు తిరుపతి అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వున్న యాదవ సామాజికవర్గానికి తెలుగుదేశం పార్టీపై అభిమానం మరింత పెరిగే పరిస్థితి వుంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా తిరుపతి టీడీపీలో కొనసాగుతున్న నరసింహయాదవ్ బీసీ కోటాలో అసెంబ్లీ టికెట్ కోసం గత ఎన్నికల్లోనూ గట్టిగా యత్నించారు. టికెట్ దక్కకపోయినా తుడా ఛైర్మన్ పదవి లభించింది. తర్వాత పార్లమెంటు పార్టీ అధ్యక్ష పదవి కూడా దక్కింది. రానున్న ఎన్నికల్లో కూడా టికెట్ కోసం రేసులో వున్న నరసింహ యాదవ్ పార్టీ జయహో బీసీ సదస్సులో ఈ మేరకు లేఖ అందజేసి అధినేత దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించారు.

రేపు పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్ - గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



మీడియాతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించనున్నారు. వివరాలను వర్సిటీలో మంగళవారం వీసీ భారతి మీడియాకు వెల్లడించారు. ఆమె మాటల్లోనే.. 'ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నాం. 57మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తాం. 12మందికి పుస్తక, నలుగురికి నగదు బహుమతులిస్తాం. విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో శాస్త్రవేత్త మంగళ మణి ప్రసంగిస్తారు. 859 మందికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేస్తాం. ఇటీవల కాలంలో వర్సిటీ మంచి అభివృద్ధిని సాధిస్తోంది. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్లు పొందాం' అని వీసీ వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రజని, సీనియర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

బిల్లులు చెల్లిస్తేనే సచివాలయంలోకి...!



తనకు బిల్లులు చెల్లించే వరకు సచివాలయంలోకి వెళ్లడానికి వీల్లేదంటూ కేవీబీపురం మండలం ఓళ్లూరు సర్పంచ్ సురేష్ సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులు, వార్డు మెంబర్లతో కలిసి మంగళవారం ఉదయం సచివాలయానికి వచ్చిన సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా డోరు వద్ద అడ్డంగా బైఠాయించారు. ఈ విషయం తెలుసకున్న పోలీసులు, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ దయాసాగర్ సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. గతంలో చేసిన రెండు మోటారు పనులకు రూ.5లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అలాగే ప్రస్తుతం మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయించేందుకు సైతం బిల్లులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు.తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు.తాను టీడీపీ సర్పంచ్ కావడంతోనే ఎంబుక్ బిల్లు పెట్టడం లేదని సర్పంచ్ ఆరోపించారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు.

- కేవీబీపురం

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదు

● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు



చిత్తూరు రూరల్, మార్చి 5: జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకూడదని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, జిల్లా స్టోర్స్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం చిత్తూరులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వేసవి మొదలైందని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పరీక్షల సమయం కావడంతో 24 గంటలూ విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. విద్యుత్ బిల్లుల పెండింగ్ బకాయిలను త్వరగా వసూలు చేయాలన్నారు. ఎండలకు ఎక్కువ శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదముందని, వీటిని వెంటనే మరమ్మతు చేయాలన్నారు. ఈఈలు పద్మనాభపిళ్లై, హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ వేదికపైకి అగ్నికుల్



ప్రైవేట్ రంగంలో రెండో రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోటలోని షార్ సిద్ధమవుతోంది. త్వరలో అగ్నికుల్ రాకెట్‌ను ప్రయోగించనున్న నేపథ్యంలో రాకెట్‌ను షార్‌లోని ఏఎస్ఎల్వీ కాంప్లెక్స్‌లో అనుసంధానం చేశారు. మంగళవారం రాకెట్‌ను ప్రైవేట్ ప్రయోగ వేదికకు తరలించారు. అగ్నికుల్ కాస్మోస్,మద్రాసు ఐఐటీ స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ తరఫున సబ్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించి షార్ నుంచి ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నికుల్ ప్రయోగ వాహకనౌకకు అగ్నిబాన్ సబార్బిటల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్‌వోఆర్ టీఈడీ)గా నామకరణం చేశారు. ప్రస్తుతం ప్రయోగ వేదిక రాకెట్‌కు పలు తనిఖీలు జరుగుతున్నాయి. ఇది అగ్నిలెట్ ఇంజన్‌తో నడిచే సింగిల్ స్టేజ్ వాహక నౌక. ఈ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను పూర్తిగా 3డీ సాంకేతికతతో రూపొందించారు. 6కేఎన్ సామర్థ్యాన్ని కలిగిన ఈ రాకెట్‌లో 300 కిలోల పేలోడ్‌తో 700 కిలోమీటర్ల దూరంలో పంపే విధంగా డిజైన్ చేశారు. షార్‌లో అగ్నికుల్‌కు చెందిన సొంత ప్రయోగ వేదిక, మిషన్ కంట్రోల్ సెంటర్‌ను గత ఏడాది ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

- సూళ్లూరుపేట

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

చిత్తూరు, మార్చి 5: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థిని మృతిచెందిన సంఘటన చిత్తూరులో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం రెడ్డివారిపూరుకు చెందిన పూజిత (17) తన అన్నతో కలిసి చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఇక్కడే ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పూజిత అన్న సోమవారం మదనపల్లెకు వెళ్లి మంగళవారం తిరిగి చిత్తూరుకు వచ్చాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంటి తలుపులను తట్టగా ఎంతసేపటికీ పూజిత తలుపు తెరవకపోవడంతో కిటికీలోంచి చూశాడు. అప్పటికే పూజిత ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మా భూములు తీసుకొని.. మాపైనే దౌర్జన్యమా?



రామాపురం సీఎంసీ వద్ద నినాదాలు చేస్తున్న దళితులు

గుడిపాల, మార్చి 5: 'ప్రజల కోసమని చెప్పి మా భూములను లాక్కొని సీఎంసీకి ఇచ్చారు. ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదు. భూములను చదును చేస్తుండటాన్ని ప్రశ్నిస్తే మాపైనే దౌర్జన్యం చేస్తారా?' అంటూ గుడిపాల మండలం 190 రామాపురం దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం 190 రామాపురం సీఎంసీ వద్ద సుమారు 20 కుటుంబాల వారు నిరసన తెలిపారు. 15 ఎకరాల సెటిల్‌మెంట్ భూమిని సీఎంసీ అధికారులు ఆక్రమించుకుని ఇంతవరకు రూపాయి కూడా చెల్లించకుండా కడుపు కొడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసేంతవరకు పోరాడతామని, బుధవారం ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



పెనుమూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న రూ.80వేల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ సీఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె సమీపంలోని పొలంలో 26 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పూడ్చిపెట్టారని పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం పోలీసులు దాడి చేసి పూడ్చిపెట్టిన 2496 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, శివకోటిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది జయశంకర్, సురేంద్ర పాల్గొన్నారు.

పేలుడు ఘటనలో ఇద్దరిపై కేసు

గంగాధరనెల్లూరు, మార్చి 5: గంగాధరనెల్లూరు మండలం కొత్రకోన పంచాయతీ కె.లక్ష్మీరెడ్డిపల్లెకు సమీపంలోని స్టోన్ క్రషర్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన పేలుడుకు సంబంధించి ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ గటనలో 20 ఇళ్లకుపైగా కిటికీలు, గాలి కిటికీలు, షోకేస్ అద్దాలు పగిలిపోయి, ఐదారు ఇళ్ల గోడలు బీటలు వారాయి. దీనిపై తహసీల్దార్ రవి, సిబ్బంది, గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ తమ సిబ్బందితో కలిసి పేలుడు సంభవించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. కె.లక్ష్మీరెడ్డిపల్లె గ్రామస్తులను విచారించారు. అధికారుల విచారణలో స్టోన్ క్రషర్ నిర్వహించి సుమారు మూడునెలలు కావొస్తుందని వెలుగులోకి వచ్చింది. అయితే ఏకారణం చేత సోమవారం పెద్ద ఎత్తున పేలుడు సంభవించిందనేది విచారణలో తేలుతుందని అధికారులు పేర్కొన్నారు. స్టోన్ క్రషర్ లైసెన్స్ యాజమాని శ్రీధర్, స్టోన్ క్రషర్‌కు జిలెటిన్‌స్టిక్స్ సరఫరా చేసే లైసెన్స్‌హోల్డర్ రమేష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెస్ట్ సీఐ తెలిపారు.

రేపు సారంగపాణి ప్రాజెక్టు ప్రారంభం

తిరుపతి (కల్చరల్), మార్చి 5: చిత్తూరు జిల్లా కార్వేటినగరం ప్రాంతంలో నివసించిన 17వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారుడు, కర్ణాటక సంగీత స్వరకర్త, వేణుగోపాలస్వామి భక్తుడు సారంగపాణి పేరిట టీటీడీ ఓ ప్రాజెక్టును ప్రారంభించనుంది. సుమారు 5వేలకుపైగా కీర్తనలు రచించిన ఈయన జీవన విశేషాలు భావితరాలకు అందించడానికి ఈ ప్రాజెక్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. శ్వేత భవనంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీల, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణయాచేంద్ర తదితరులు పాల్గొంటారు.

ప్రభుత్వ పాఠశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బి.కొత్తకోట, మార్చి5: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు సలీంబాషా కోరారు. ఆమేరకు మంగళవారం స్వీపర్లతో కలిసి బి.కొత్తకోట ఎంఈవో రెడ్డిశేఖర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. గత నాలుగేళ్లనుంచి ప్రభుత్వ పాఠశాలల్లో రూ.6000 గౌరవవేతనం ఇస్తూ మహిళల చేత పారిశుధ్య పనులు చేయించుకుంటున్నారని, వారిని పారిశుధ్య కార్మికులుగా గుర్తించి ప్రభుత్వం కనీస వేతనం రూ21000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహిళల చేత చాకిరీ చేయించుకుంటూ ఆ గౌరవ వేతనం కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్వీపర్ల సమస్యలపై పోరాటంలో భాగంగా మొదటి విడతగా అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులతో పాటు అనుబంధ సంఘం మైన ఆయా స్వీపర్స్ యూనియన్ మండల నాయకురాళ్లు లక్ష్మీదేవి, శంకరమ్మ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధికి ఉచిత వైద్యం



క్షయ వ్యాధిపై సూచనలిస్తున్న వైద్యాధికారి రమేష్‌బాబు

కలికిరి, మార్చి 5: క్షయ వ్యాధిగ్రస్తులకు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా చికిత్స లభిస్తుందని జిల్లా టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. టీబీ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన క్షయవ్యాధి చికిత్సలపై మంగళవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దగ్గుతోపాటు వరుసగా జ్వరం రావడం క్షయ వ్యాధి సోకిందని అనుమానించవచ్చని చెప్పారు. బరువు తగ్గిపోవడం, రక్తంతో కూడిన గల్ల పడటం కూడా వ్యాధి నిర్ధారణకు సహకరించే లక్షణాలని వివరించారు. వ్యాధిగ్రస్తులకు రూ.20 వేల విలువైన మందులు ఉచితంగా అందజేస్తామని వాటితోపాటు నెలకు రూ.500 వంతున పోషకాహార ఖర్చులకు కూడా అందజేస్తామని రమేష్ బాబు పేర్కొన్నారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులతో చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందని తెలిపారు. క్షయ వ్యాధి నివారణకు 18 ఏళ్ల పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ కూడా వేయించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ బయన్న, యూనిట్ సిబ్బంది మురళి, నాగిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య పరిష్కరించండి

పెద్దమండ్యం, మార్చి 5: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులుకు పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, మండల సర్పంచులు కోరారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారినికి ముందస్తుగా నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ, సర్పంచులు కోరారు. తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో తాగునీటి పథకం ద్వారా బోర్లు వేయించాలన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై సమాచారం ఇస్తే వెంటనే జిల్లా సమావేశంలో అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు విడుదల చేయిస్తామన్నారు. మండలంలో ప్రజా సమస్యలు, రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంకటరమణయ్య, సర్పంచులు విశ్వనాథ, బాష, పద్మావతి, బయ్యారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ వ్యవస్థాపకుడు రామ్మోహన్‌కు ఘన నివాళి



రామ్మోహన్ రావుకు నివాళులర్పిస్తున్న ఎన్ఎంయూ నేతలు

పీలేరు, మార్చి 5: నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడైన పి.రామ్మోహన్ రావు 19వ వర్ధంతి సందర్భంగా పీలేరులోని యూనియన్ నాయకులు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం పీలేరు డిపో కార్యాలయం వద్ద ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి దానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమే కాకుండా ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం బండ్ల కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీఎస్ఎం రాజు, డిపో అధ్యక్షులు సీవీ రమణ, బీఆర్‌బీ నాయక్, ఎంహెచ్ నాయుడు, శ్రీహరి, రఘు, హరి, ప్రసాద్, వీపీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్-స్టేషన్‌ను సందర్శించిన ఎంజేఆర్ కళాశాల విద్యార్థులు


విజ్ఞానయాత్రకు బయలుదేరుతున్న ఎంజేఆర్ కళాశాల విద్యార్థులు

పీలేరు, మార్చి 5: పారిశ్రామిక సందర్శనలో భాగంగా మంగళవారం పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం బండకిందపల్లె వద్దనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్-స్టేషన్‌ను సందర్శించారు. ఎంజేఆర్ కళాశాలలోని ఈఈఈ, మెకానికల్ బ్రాంచీల్లో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వాస్తవిక అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో కళాశాల చైర్మన్ అవినాశ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ఈ పారిశ్రామిక సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సబ్-స్టేషన్‌లో ఏఈ రాంప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అక్కడున్న వివిధ పనిముట్లు, సబ్-స్టేషన్ పనిచేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.రెడ్డిఖాసిం, సుహేల్, భరత్, బాలాజీ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు విద్యుత్ గురించి వివరిస్తున్న ఏఈ రాంప్రసాద్ రెడ్డి

తాయిలాలు తెస్తున్న వారిని తరమండి!

- పరిశ్రమలు, ఉద్యోగాలు ఎందుకు తేలేదో నిలదీయండి
- అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదో ప్రశ్నించండి
- ప్రజలకు టీడీపీ నేత నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పిలుపు
- సమష్టిగా పనిచేసి జయచంద్రారెడ్డిని గెలిపిద్దాం : కొండ్రెడ్డి


పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు


కొండ్రెడ్డితో తంబళ్లపల్లె టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

పీలేరు, మార్చి 5: ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు చీరలు వంటి తాయిలాలు తెస్తున్న వైసీపీ నాయకులను తరిమి కొట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పీలేరు పట్టణం తిరుపతి రోడ్డులోని నాయీబ్రాహ్మణ, రజక, విశ్వబ్రాహ్మణ, జర్నలిస్టు కాలనీల్లో మంగళవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గురించి పట్టించుకోకుండా అక్రమ సంపాదనపై దృష్టి సారించి దోచుకున్న వైసీపీ నాయకులు సిగ్గూ ఎగ్గూ లేకుండా రూ.200లు కూడా విలువ చేయని చీరలు పంపిణీ చేస్తూ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, తమకు తాయిలాలు అవసరం లేదని, అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి గురించి ఎందుకు పట్టించుకోలేదని, పరిశ్రమలు, ఉద్యోగాలు ఎందుకు తేలేకపోయారని వైసీపీ నాయకులను ప్రశ్నించాలని కిశోర్ ప్రజలను కోరారు. తెలుగుదేశం బీసీలకు పుట్టినిల్లు లాంటిదన్నారు. టీడీపీ తరఫున పోటీచేస్తున్న తనను ఎన్నికల్లో ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రాజన్న, ఆంజి, వెంకటరత్నం, రమణ, రమేశ్, ముఖేష్, వాసు, బాలాజీ, జయరాం, లక్ష్మయ్య, రాధా, టీడీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, శివారెడ్డి, బోడింపల్లె సూరి, పిట్టా భాస్కరరెడ్డి, ప్రభాకర్ రాజు, ధర్మరాజు, ఆంజి, పురం రెడ్డమ్మ, సుభద్రమ్మ, సాధన, లక్ష్మీకాంతమ్మ, షమ, మీనా, చందన, స్వర్ణ, కళావతి, రెడ్డిరాణి, రమాదేవి, నాగేంద్ర, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేసి జయచంద్రారెడ్డిని గెలిపిద్దాం: కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 5: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలో ఎటువంటి వర్గ విభేదాలకు తావులేకుండా కేడరంతా సమన్వయంతో సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని గెలిపిద్దామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడి పిలుపునిచ్చారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డిని తంబళ్లపల్లెలోని ఆయన నివాసంలో జయచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు టీడీపీ సీనియర్ నాయకులతో కలసి ఎన్నికల సంగ్రామంపై చర్చించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ..కొండ్రెడ్డి గత రెండేళ్లుగా వైసీపీ అరాచకాలు, అక్రమ కేసులను ఎదుర్కొని టీడీపీ పటిష్టతకు కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా నిలిచాడన్నారు. టీడీపీ సీనియర్ నాయకుల, సలహాలు సూచనలతో ప్రజలను కలుపుకుని రానున్న ఎన్నికల సంగ్రామంలో విజయ డంకా మోగించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. అనంతరం కొండ్రెడ్డి మాట్లాడుతూ...సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి ప్రజలు, రైతులు సమస్యలు తీర్చడానికి వచ్చిన జయచంద్రారెడ్డిని ఒక్కసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యకర్తలు ఎవ్వరూ భయపడవద్దని ఏ కష్టమొచ్చినా తాము అండగా ఉండి ఆదుకుంటామని ఇరువురు నేతలు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సోముశేఖర్, సుబ్రమణ్యం, తాతిరెడ్డి, వీరాంజినేయులు, పీర్లమాబు, సుబహాన్, ధనుంజయరాయల్, మునాఫ్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

ములకలచెరువు, మార్చి 5: రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పోలింగ్ బూత్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు శేఖర్‌నాయుడు, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ముత్యాల నాగరాజు, ఉమాశంకర్, గంగాద్రి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు, మార్చి 5: కేవీపల్లెలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి జరిగే ప్రవేశాలకు ఓసీలు, బీసీలు రూ.150లు, ఎస్సీ, ఎస్టీలు రూ.75లు చెల్లించి ఈ నెల 31వ తేదీలోపు సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు పాఠశాలను సందర్శించాలని ఆయన తెలిపారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతిలో గల ఆదర్శ పాఠశాలలో 6వతరగతిలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలలో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో మోడల్ స్కూల్‌లో గాని ఆన్‌లైన్‌లో గాని పేరును నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పరీక్షను ఏప్రిల్ 21న నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్ నందు సంప్రదించాలని తెలిపారు.

రామసముద్రంలో: రామసముద్రం సమీపంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.మునుస్వామినాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏప్రిల్ 21న స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె ఆదర్శ పాఠశాలలో (మోడల్ స్కూల్) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు చెల్లించి ఏపిఎంఎస్.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నందు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బి.కొత్తకోటలో: బి కొత్తకోట మండలంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనూనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనపరచిన వారిని ఆయా కేటగిరీలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో..

కురబలకోట, మార్చి 5: మండలంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, బీసీ, ఈబీసీ విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-2015 మధ్య ఎస్సీ,ఎస్టీలు 1-9-2011 నుంచి 31-8-2015 మధ్య జన్మించి 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా నమోదు చేసుకోవాలన్నారు, వారికి ప్రవేశపరీక్షలను నిర్వహించి అర్హత సాధించిన విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల సంక్షేమం కోసం టీడీపీని గెలిపించండి


గొల్లపల్లెలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

వాల్మీకిపురం, మార్చి 5: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపీ-జనసేనని గెలిపించాలని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వాల్మీకిపురం మండలం గొల్లపల్లెలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆలోచనలతో పొందుపరచిన బంగారం లాంటి ఆరు సంక్షేమ పథకాలను ఇంటింటా వివరిస్తూ టీడీపీ,జనసేన ఉమ్మడి ప్రభుత్వాం అధికారంలోకి రాగానే తప్పక అమలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం జగన్ అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రానున్న 40రోజులు నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేసి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని తప్పక గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రాచారి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పై రాయితీని వినియోగించుకోండి

బి.కొత్తకోట, మార్చి5: ఇంటిపన్ను బకాయిలపై వడ్డీమాఫీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపంచాయతీ, సచివాలయ సిబ్బంది మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉన్న పెండింగ్ బకాయిలను ఏకకాలంలో చెల్లించిన వారికి వడ్డీమాఫీ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, వాటిని గడువులోగా చెల్లించి వెసులుబాటు పొందాలని పట్టణంలోని తాకాటంవారిపల్లి సచివాలయ పరిధిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పీఎస్ మనోహర్ మాట్లాడుతూ బి.కొత్తకోట నగరపంచాయతీలో పాతబకాయిలు రూ.1.50కోట్లు, ప్రస్తుత బకాయిలు రూ.0.79 కోట్లు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజలు చెల్లిస్తే వారికి రూ.0.68 కోట్లు వడ్డీమాఫీ అవుతుందన్నారు.

దడ పుట్టిస్తున్న ఇసుక టిప్పర్లు

- రోడ్డుపై జారిపడుతున్న వాహనాలు

వాల్మీకిపురం, మార్చి 5: వాల్మీకిపురం పట్టణంలోని బైపాస్ రోడ్డు గుండా వెళ్లే ఇసుక టిప్పర్లు జనాలకు దడ పుటిస్తున్నాయి. నిత్యం జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో లారీలు అతివేగంతో వెళ్తుండటం జనం పక్కకు పరుగులు తీయాల్సిందే. స్థానికంగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నా లెక్కచేయక వెళ్తుండటంతో రోడ్లపై ఎటు చూసినా ఇసు పేరుకుపోయి ద్విచక్రవాహనాలు జారిపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఇసుక టిప్పర్ లారీల పట్ల పోలీసులు, అధికారులు దృష్టి సారించి చర్య లు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహాశివరాత్రి పూజలు జరిగేనా..?

- నేలమల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణంతో అయోమయంలో ప్రజలు
- ఉత్సవాలకు ఏర్పాట్లు చేశామన్న ఈవో మంజుల

నిమ్మనపల్లి, మార్చి 5: మండలంలోని తవళం అటవీప్రాంతం బాహుదా నదీ పరివాహక ప్రాంతంలో వెలసిన నేలమల్లేశ్వస్వామి ఆలయంలో ఈ ఏడాది మహాశివరాత్రి పూజలు జరిగేటట్లు కనిపించడంలేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1986లో భక్తాదులు ఇచ్చిన విరాళాలతో వెంకటరమణరెడ్డి, ఇట్టా శేషయ్యశెట్టిలు ఆలయాన్ని నిర్మించారు. అయితే అప్పుడు నిర్మించిన గుడి వర్షాలకు దెబ్బతినడంతో దేవదాయశాఖ ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.3.18లక్షలతో గత మూడు నెలలుగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ఆలయ పనులు అసంతృప్తిగా ఉండడంతో భక్తులు ఈయేడు శివరాత్రి ఉత్సవాలు ఉండవని నిర్ధారణకు వచ్చారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాం

ఈ ఏడాది ఆలయం పక్కన ఉన్న మండపంలో శివరాత్రిని ఉత్సవాలు నిరంహించనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. అయితే స్వయంబు బాలాశంకరుడి ఆలయంలో పూజలు జరగవని తెలిపారు. కాగా శివరాత్రికి ఆలయం వద్దకు వచ్చే భక్తులకు అన్నదానంతో పాటు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నూతనంగా ఆలయ నిర్మాణం చేపడుతున్నామని గర్భగుడికి రూ.2కోట్లు మంజూరు అయిందని ఆలయ ఈవో తెలిపారు. కాగా మంగళవారం ఆలయ నిర్వాహకులు, మండల స్థాయి అధికారులతో కమిటీ సమావేశం నిర్వహించి మహాశివరాత్రి ఉత్సవాలపై చర్చించారు.


శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈవో మంజుల, అధికారులు

స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు డిగ్రీ కళాశాల పరిశీలన


ఎస్‌జీ డిగ్రీ కళాశాలను సందర్శిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్, అధికారులు

పీలేరు, మార్చి 5: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం పీలేరు నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు కోసం పీలేరులోని సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ పరిశీలించారు. మంగళవారం పీలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అయిన జేసీ, పీలేరు నియోజకవర్గ ఈఆర్‌వో రమా నేతృత్వంలో అధికారులు కళాశాల పరిసరాలను సందర్శించారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు తలపెట్టిన అధికారులు అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో మార్పునకు నిర్ణ యించారు. ఈ క్రమంలో డిగ్రీ కళాశాలలోని వివిధ గదులు, క్రీడా మైదానాన్ని అధికారు లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులే కీలకం


సెక్టోరియల్ అధికారులకు శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 5: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులదే కీలక బాధ్యత అని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 259 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా వాటిని 38 సెక్టార్లుగా విభజించామని ప్రతి సెక్టార్‌కు ఒక సెక్టోరియల్ అధికారి ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల సందర్శన, అక్కడ సదుపాయాలను పరిశీలిం చి సెక్టోరియల్ అధికారులు సర్టిఫై చేయాలన్నారు. ఈవీఎంల ఏర్పాటు, పోలింగ్ సమయం లో ఈవీఎంలు మర మ్మతు వస్తే వాటిని రీప్లేస్ చేయడం సెక్టోరియల్ అధికారుల బాధ్యత అన్నారు. ఈవీఎంలను ఎలా ఉపయోగించాలో, ప్రజలకు తెలియ జేయాలన్నారు. సమావేశంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు


పాత ములకలచెరువు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

ములకలచెరువు, మార్చి 5: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించి పలు రికార్డులు తనిఖీ చేశారు. అలాగే ములకలచెరువు, పాత ములకలచెరువులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌కుమార్, సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి ఉన్నారు.

తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా శంకర్‌ను ప్రకటించాలి


బురకాయలకోటలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న టీడీపీ శ్రేణులు

ములకలచెరువు, మార్చి 5: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను ప్రకటించాలని టీడీపీ నాయకులు, మద్దతుదారులు కోరారు. మండలంలోని బురకాయలకోటలో మంగళవారం శంకర్‌కు న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన చేశారు. ఐదు సంవత్సరాలుగా పార్టీని తన భుజాలపై పార్టీని మోసి, అధికార పార్టీ వేధింపులు, దాడుల నుంచి టీడీపీ శ్రేణులను కాపాడుకుంటూ వచ్చిన శంకర్‌కు అన్యాయం చేయడం దారుణమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జులు రామకృష్ణమరాజు, జేసీబీ సుధాకర్‌నాయుడు, రమణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు గుత్తా సుధాకర్‌నాయుడు, సుబ్బినాయుడు, సుధాకర్‌నాయు డు, శ్రీనివాసులు, చెన్నకేశవనాయుడు, నాగమల్లప్ప, శంకర్‌నారాయణ, సుదర్శన్, కాలా మహేష్, ఆదినారాయణ, రమణారెడ్డి, చెన్నకేశవులు, నాగరాజుయాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటిస్థలం ఆక్రమణదారుల నుంచి కాపాడండి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేసి వస్తున్న బాధితురాలు లక్ష్మీదేవీ తదితరులు

కురబలకోట, మార్చి 5:ప్రభుత్వం ఇచ్చిన ఇంటిస్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారని బాధితురాలు లక్ష్మీదేవీ ఆర్డీవోకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఆమేరకు ఇంటి స్థలంపై జరిగిన అన్యాయంపై బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ అమ్మచెరువు మిట్ట వద్ద సర్వేనెంబర్ 859లో లే-అవుట్ వేసి ప్లాట్ నెంబర్ 13ను తనకు కేటాయించారన్నారు. అయితే స్థానిక అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకుని బెదిరిస్తున్నారని అంతేకాకుండా రాత్రిపూట మద్యం తాగి వచ్చి మహిళలపై నానా దుర్భషలాడుతున్నారని వారి నుంచి తమను రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఫిర్యాదులో ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజ, కృష్ణప్ప, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి బెస్ట్ ఉమెన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అవార్డు



మెడికల్ ప్రాక్టీసనర్ అవార్డు అందుకొంటున్న డాక్టర్ దీప్తీ

మదనపల్లె అర్బన్, మార్చి 5:మదనపల్లెకు చెందిన ఇద్దరు డాక్టర్లు వలిగట్ల దివ్య, దీప్తిలు ఉత్తమ ఉమెన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అవార్డులు అందుకొన్నారు. మంగళవారం వోవ్, కేరళ హిమాలయ, వైద్యరత్న భోపాల్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలో దక్షిణ భారతదేశం నుంచి డాక్టర్లు వలిగట్ల దివ్య, దీప్తిలు అవార్డుకు ఎంపిక కావడం గర్వించదగ విషయమని హిమాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. మదనపల్లెలో గత ఐదేళ్లుగా బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మోకాలి నొప్పి, వెన్ను నొప్పి, సొరియాసిస్ తదితర ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేస్తూ మంచి పేరును సంపాదించారని చెప్పారు. అవార్డు పొందిన డాక్టర్లను సహచర డాక్టరు బబితాశర్మ తదితరులు అభినందించారు.

ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పీలేరు, మార్చి 5: నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. వారు రూపొందించిన 'మై ఓట్-మై ఫ్యూచర్' పోటీల వాల్‌పోస్ట ర్లను మంగళవారం పీలేరులో ఆవిష్కరించారు. పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన వారు కరప త్రంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మార్చి 12వ తేదీలోపు ఓటు గురించి మంచి సందేశం ఉన్న రీల్స్ కొటేషన్స్, పోస్టర్స్ తయారు చేసి పంపాలన్నారు. తొలిసారి ఓటు పొందిన వారందరూ రాష్ట్ర భవిష్యత్తు గురించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ముబారక్, ఎస్వీఆర్ నఫీస్, తెలుగు యువత నేతలు క్రాంతి, మోదిన్ బాషా, శ్రీనివాసులు, భానుప్రకాశ్, హరి, ప్రసాద్, పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు

బి.కొత్తకోట, మార్చి5: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 1వతరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలోనూ 1వతరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాలు ఉంటాయన్నారు. జూన్ 2, 2018 నుంచి, 31మే 2019 లోపల జన్మించిన పిల్లలు ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేయవచ్చన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సచివాలయం, ఎంఈఓ కార్యలయం, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.